# చెరువుల పరిరక్షణపై స్పెషల్ ఫోకస్

- లేక్ పార్కులుగా మారనున్న గ్రేటర్ పరిధిలోని 185 చెరువులు
- ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు బాధ్యతలు
- గేటెడ్, కమ్యూనిటీ, ఆకాశహర్మ్యాల వద్దే ఎస్టీపీలు
- త్వరలోనే ప్రత్యేక కమిటీకి కమిషనర్ ప్లాన్



**ఖైరతాబాద్, ప్రజానావ:** చెరువులు భవిష్యత్ తరాలకు ఆహ్లాద వాతావరణాన్ని అందించేలా జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఓవైపు చెరువులపై స్పెషల్ ఫోకస్ చేస్తూనే, గ్రేటర్ పరిధిలోని 185 చెరువులను లేక్ పార్కులుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చాలా వరకు చెరువులు మురికి కూపాలుగా, ఆక్రమణలతో అంధవికారంగా మారాయి. వీటి బాధ్యతలను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులకు అప్పగించేలా ప్రత్యేక ప్రణాళిక తయారు చేసినట్లు సమాచారం. భవిష్యత్తులో ఎక్కడా కూడా చెరువులు కబ్జాకు గురవ్వకుండా, మురుగు దరిచేరకుండా చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే వీరితో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇక నగరంలోని గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్థులు భవనాలు, ఆకాశహర్మ్యాల వద్దే ఎస్టీపీలను ఏర్పాటు చేసుకునేలా ప్లానింగ్ విభాగాన్ని బలోపేతం చేసేలా కమిషనర్ యోచిస్తున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. ఎస్టీపీల ఏర్పాటుతో మురుగు నీరు నేరుగా నాలాలు, డ్రైనేజీలోకి చేరదని, తద్వారా చెరువుల్లోకి శుద్ధిచేసిన నీరు, వర్షపు నీరు మాత్రమే చేరి చెరువులు స్వచ్ఛతగా మారుతాయనేది కమిషనర్ భావనగా చెబుతున్నారు. ఇదిలాఉంటే కాలనీల నుంచి వచ్చే మురుగుకు చెక్ పెట్టేందుకు నాలాలు, వరద కాలువల్లో అక్కడక్కడ చెక్ డ్యాంల తరహాలో నిర్మాణాలు, జాలీలు ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించినట్టు తెలుస్తోంది. నాలాలు, చెరువల్లోకి ఘన వ్యర్థాలు వేయకుండా మెష్‌లను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు, అందులో భాగంగా ఆరు చెరువులకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు వివరిస్తున్నారు.



## ఈసారి శ్రీ సప్తముఖ మహాశక్తిగా

- ఏడు పడగల ఆదిశేషుడి నీడలో సప్తముఖాలతో దర్శనమివ్వనున్న ఖైరతాబాద్ గణేశుడు
- స్వామి వారి కుడివైపు అయోధ్య బాలరాముడు
- 70 ఏండ్ల సందర్భంగా 70 అడుగుల ఎత్తులో విగ్రహ ప్రతిష్ఠాపన

**ఖైరతాబాద్, ప్రజానావ:** ప్రతి ఏడాది భిన్నమైన రూపాలతో కనిపించే ఖైరతాబాద్ మహాగణపతి ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్నారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రస్థానంలో 1954లో ఒక్క అడుగుతో మొదలై నేడు 70 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 70 అడుగుల ఎత్తులో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నారు. ఏడు పడగల ఆదిశేషుడి నీడలో సప్తముఖాలతో ఖైరతాబాద్ మహాగణపతి కనిపిస్తారు. కుడివైపు ముఖాల్లో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఎడమవైపు ముఖాల్లో సరస్వతి, లక్ష్మి, పార్వతి అమ్మవార్లు ఉంటారు. అలాగే రెండు వైపులా సప్తహస్తాలతో విభిన్నమైన ఆయుధాలను ధరించి స్వామి వారు దర్శనమిస్తారు. కుడివైపు చక్రం, పాశం, త్రిశూలం, పద్మం, శంఖం, అభయహస్తం, ఎడమ వైపు రుద్రాక్షమాల, పాశం, గ్రంథం, వీణ, కమలం, గధ, మరో చేతిలో (మొదక హస్తం) ప్రసాదాన్ని పట్టుకొని ఉంటారు. స్వామి వారి కుడివైపు అయోధ్య బాలరాముడు, ఎడమవైపు రాహు, కేతుల విగ్రహాలు, స్వామి వారి వాహనం మూషికం ఉంటాయి. వీటితో పాటు ఉప మండపాల్లో శ్రీ శ్రీనివాసుడు, లక్ష్మి కల్యాణంలో క్షీరసాగర మథనం, శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణంలో బ్రహ్మ, విష్ణు, నారద మహర్షిని వీక్షించవచ్చు. ఇదిలాఉంటే ఈసారి స్వామి వారి విగ్రహం 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో దర్శనమిస్తారు. వీటితో పాటు కుడివైపు పది అడుగుల అయోధ్య బాలరాముడి విగ్రహం, ఎడమ వైపు తొమ్మిది అడుగుల ఎత్తులో రాహు, కేతుల విగ్రహాలు, మూడు అడుగుల మూషికాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కుడి వైపు 15 అడుగుల మండపంలో తొమ్మిది అడుగుల ఎత్తులో లక్ష్మి, శ్రీనివాసుడి విగ్రహాలు, ఎడమవైపు మండపంలో అంతే ఎత్తులో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.

## కోనరావుపేటలో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ



**కోనరావుపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ 30ఏళ్ల పోరాటన్ని గుర్తించి ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సందర్భంలో కోనరావుపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కలకోట రవి, ఆధ్వర్యంలో డబ్బు చప్పుల్లతో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగ ఫలితం, అలుపెరుగని మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ తీర్పు అన్నారు. జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ జరగాలని కోరుకుంటూ మాదిగలకు మాటిచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్షలాది మందిలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ధన్యవాదాలు తెలిపారు. ఉద్యమానికి అన్ని రకాల సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్‌కి ఉద్యమ అభినందనలు తెలిపారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ దేశంలో అందరికంటే ముందు వర్గీకరణ చేస్తానని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గుండా థామస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ, ఎలగందుల భిక్షపతి మాదిగ, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్, బొల్లె మార్కు మాదిగ, బొల్లె బాబుమాదిగ, ముత్యం రాజుమాదిగ, అక్కనిపెల్లి సురేశ్ మాదిగ, లింగంపల్లి జాను మాదిగ, మల్యాల మధు, స్వామి దాస్, కుమ్మరి దేవదాస్ పాల్గొన్నారు.



## క్లబ్ మహీంద్రా హాలీడే రిసార్ట్ విస్తరణ

### సీఎం రేవంత్‌తో ఆనంద్ మహీంద్రా భేటీ

**ఖైరతాబాద్, ప్రజానావ:** హైదరాబాద్‌లో క్లబ్ మహీంద్రా హాలీడే రిసార్ట్ విస్తరణకు ఆనంద్ మహీంద్రా గ్రూప్ ముందుకొచ్చింది. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మహీంద్రా గ్రూప్, మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్, టెక్ మహీంద్రా లిమిటెడ్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో మహీంద్రా పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని అడాప్ట్ చేసుకునేందుకు ఆనంద్ మహీంద్రా అంగీకరించారు. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిశీలనకు తమ బృందాన్ని పంపుతామని ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా వెల్లడించినట్లు తెలుస్తోంది.

## అర్ధరాత్రి ఒంటి గంట వరకు హొటళ్లకు అనుమతి

- మద్యం అమ్మకాలకు ప్రస్తుత నిబంధనలే
- అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** హైదరాబాద్ నగరంలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు రెస్టారెంట్లు నడుపుకునేందుకు అనుమతి ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిపై జరిగిన స్వల్పకాలిక చర్చకు సీఎం సమాధానమిస్తూ పలు విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అయితే ఈ అనుమతి రెస్టారెంట్లు, హొటళ్లు, టీ దుకాణాలకే పరిమితం తప్ప బార్లు, వైన్ షాపులకు కాదని స్పష్టత ఇచ్చారు. మద్యం దుకాణాలు, బార్లు ఇప్పుడు ఉన్న నిబంధనల మేరకే పని చేస్తాయన్నారు. త్వరలోనే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లను పిలిచి ఇందుకు సంబంధించిన సూచనలు జారీ చేస్తామని తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు తగినట్లుగా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నామని వివరించారు. తాము అసెంబ్లీ వేదికగా చెప్పిన దానికి పూర్తి ఆదేశాలు త్వరలోనే జారీ చేస్తామని వివరించారు.

## అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు

**వేములవాడ రూరల్, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల కేంద్రంలోని ఫాజుల్ నగర్ అంగన్వాడీ కేంద్రం-1లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లల బరువుతో పాటు ఎత్తును కొలతలు వేశారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, తద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదుగుతారని చెప్పారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అంగన్వాడీ టీచర్ పంబా రాజేశ్వరి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విజయ ఆశా వర్కర్ గడ్డం రాజేశ్వరి, సీఏ జలజతో పాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్క్‌లోని రాక్ వాటర్ ఫౌంటేషన్, రాక్ లైటింగ్, నడకదారి లైటింగ్స్‌ను శుక్రవారం మేయర్ విజయలక్ష్మి, జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, ఖైరతాబాద్ మున్సిపల్ కమిషనర్ అనురాగ్ జయంతి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జూబ్లీహిల్స్ డివిజన్‌కు ఏర్పాటు చేయాల్సిన నూతన వీధిలైట్లను త్వరగా సమకూర్చాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ సుష్మ, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, ప్రజానావ

## అంగన్వాడీ కేంద్రం బాగుంది

### జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఒకటో అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా శిశు సంక్షేమ అధికారి లక్ష్మీరాజ్యం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలోని పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అంగన్వాడీలో కేంద్రంలో పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టిక హారం, ఆరోగ్య లక్ష్మి భోజనం తనిఖీ చేసి, ఉపాధ్యాయురాలు భూజ్యోతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అదనపు సీడీపీఓ సుచరిత, సూపర్‌వైజర్ శంకరమ్మ పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరం

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రుర్తి మండలం కట్ట లింగంపేట గ్రామంలో చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా తిరిగి 35 మందికి పరీక్షలు నిర్వహించగా, ఇద్దరు జ్వర పీడితులను గుర్తించినట్లు మండల వైద్యాధికారి సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అర్చన, ఏఎన్ఎంలు పద్మ, రేఖ, కవిత మంజుల, భాగ్య పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ

**ఖైరతాబాద్, ప్రజానావ:** జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం చీఫ్ సిటీ ప్లానర్ గా (సీసీపీ) కె . శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు జీహెచ్ఎంసీ సీసీపీగా కొనసాగిన రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను హెచ్ఎండీఏకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

